45

# దేవుడు న్యాయవంతుడా?

## (9:14-29)

"అది న్యాయం కాదు!" అనే మాటలు నీవెప్పుడైనా విన్నావా? సంతోషం లేని పిల్లలు, అవమానించబడిన నవయౌవనులు, ఆశించినదానిని పొందని పెద్దలు ఈ మాటలు పలకడం నేను విన్నాను. ప్రభువు విషయంలో కూడ ఈలాటి మనో భావాలను వ్యక్తపరచిన ప్రజలను గూర్చి నేను విన్నాను: "నేను అంత చెడ్డవాడనేమి కాదు. నేను యితరులకు సహాయపడ ప్రయత్నిస్తాను. అయినా దేవుడు నాకు యిది చేశాడు. ఇది న్యాయం కాదు!"

దేవుడు న్యాయవంతుడా? మన మూల వాక్యంలో పౌలు ఈ విషయాన్ని (ప్రశ్నను) చర్చిస్తున్నాడు. "దేవునియందు అన్యాయము కలదా?" అని వచనం 14లో అతడు అడుగుతున్నాడు (NIV). "Is God unfair?" అని NCV వ్యక్తపరుస్తుంది. కొందరు ఇశ్రాయేలీయులను (అంటే, యేసునందు విశ్వాసముంచినవారిని) దేవుడు ఏర్పరచుకొని యితరులను (ఆయనయందు నమ్మికయుంచని) నిరాకరించడం దేవునికి న్యాయమేనా కాదా అనేది ఈ ప్రశ్నకు పూర్వ గాథయై ఉంది. దీన్ని మరొక విధంగా అడగాలంటే, (విశ్వసించని) యూదులను నిరాకరించి (నమ్మిన) అన్యజనులను అంగీ-కరించడం దేవునికి న్యాయమా? వచనం 14 మాటలను పౌలు వ్రాయించేటప్పుడు, అతని మనస్సులో ప్రత్యేకమైన పరిస్థితి ఉంది; కాని ప్రశ్నకు విశాలమైన వర్తింపు ఉంది. తన సమస్త కార్యములలో దేవుడు న్యాయవంతుడేనా? ఆయన నిరంతరం న్యాయం ఆచరిస్తాడా?

9:14-29లో, దేవుడు న్యాయవంతుడు ఎందుకంటే ఆయన ఎన్నికలు ఏక-రీతిగా ఉంటాయి. అది ఆయన ఆచరణ, వ్యక్తిత్వం మరియు ఉద్దేశంతో పొందిక కలిగి ఉంటాయి.

### ఆయన ఆచరణతో పొందికగా ఉంటాయి (9:14-18)

9:1-13లో, దేవుడు చేసుకొన్న ఏర్పాట్లను గూర్చి పౌలు మాట్లాడాడు. దేవుడు ఇస్సాకును కోరుకొని ఇష్మాయేలును నిరాకరించాడు (7బి-9 వచనాలు); ఆయన యాకోబును కోరుకొని ఏశావును నిరాకరించాడు (10-13 వచనాలు). "కాబట్టి ఏమందుము?" అని పౌలు అడిగాడు (14ఎ వచనం). అంటే, "గతంలో దేవుడు ఏర్పరచుకొన్నవాటి విషయంలో ఏమంటాం?" ఈ చర్చలోని ఈ పాయింటు వద్ద, మన ప్రస్తుతపు పాఠం కేంద్రీకృతమయ్యింది: "దేవునియందు అన్యాయము కలదా?

అట్లనరాదు” (14బి వచనం). దేవుడు అన్యాయస్థుడని నిర్ణయం జరిగినా పౌలును కలతపరచుతుంది. అందువలననే “అట్లనరాదు!” అని వెంటనే పౌలు దానితో చేర్చాడు (14సి వచనం).

ఇష్మాయేలుకు పైన ఇస్సాకును, ఏశావుకు పైన యాకోబును దేవుడు ఏర్పరచుకొనడం అన్యాయమని ఏ యూదుడును తలంచడు. ఈ తీర్మానం కొరకు పౌలు పూర్వగాథను ఏర్పాటు చేస్తున్నాడు: ఆ ఏర్పాట్లు చేసినప్పుడు న్యాయవంతుడై యున్నట్టయితే, నమ్మని యూదులపై నమ్మిన యూదులను ఏర్పరచుకొనినప్పుడు కూడ దేవుడు న్యాయవంతుడే. పైగా, విశ్వసించని యూదులపై విశ్వసించిన అన్యజనులను ఏర్పరచుకొనడం న్యాయమే.

**కనికరం: దైవికమైన అంగీకారం (15, 16 వచనాలు)**

దేవుడు ఇస్సాకు యాకోబులను కోరుకొనడం అనే విషయంనుండి, యూదుడైన ప్రతి పాఠకునికి ఎరుకైన మరి రెండు బైబిలు సంఘటనలకు పౌలు కదిలిపోయాడు. ఆ రెండును ఐగుప్తునుండి ప్రయాణానికి సంబంధించినవే. మొదటిది మోషేకును అరణ్యంలోని ఇశ్రాయేలీయులకు చెందినది: “ ‘ఎవనిని కరుణింతునో వానిని కరుణింతును; ఎవనియెడల జాలి చూపుదునో వానియెడల జాలి చూపుదును[1]’ ” (15 వచనం). ఈ కొటేషన్ నిర్గమకాండము 33:19నుండి తీయబడింది. బంగారు దూడ సంఘటనను వెంబడించి మోషేకును, దేవుడైన యెహోవాకును మధ్య జరిగిన సంభాషణ అది. దేవుని మాటలకు అర్థమేమంటే, “నా కనికరమును దయయు ఎవరు పొందుతారో నేను నిర్ణయించుతాను” అనేదే.

ఆ ప్రతిపాదననుండి, పౌలు ఈ తీర్మానానికి చేరుకుంటాడు: “కాగా పొందగోరువాని వలననైనను, ప్రయాసపడువానివలననైనను కాదు గాని, కరుణించు దేవునివలననే అగును” (రోమా 9:16). గ్రీకు మూలానికి “పరుగెత్తు మనుష్యుడు” అక్షరార్థమైన తర్జుమా పందెమందు గెలవాలని ఒక మనుష్యుడు చేయగలిగినదంతయు చేయువాని పోలికను పౌలు ఉపయోగించాడు. “పందెమందు పరుగెత్తుటలో (ఒకని) పూర్ణ ప్రయత్నపు పాటు” అని AB సూచిస్తుంది. వచనం 16ను మనం యిలా అనవచ్చు: “హృదయపూర్వకంగా కనికరం కోరే (“వాంఛించే”) లేదా కనికరం పొందాలని బహుగా ప్రయాసపడే (“పరుగెత్తే”) మనిషి మీద అది ఆధారపడదు. అయితే, కనికరాన్ని ప్రసాదించే దేవుని మీదనే అది ఆధారపడియుంటుంది.”

పౌలు యొక్క ప్రతిపాదన ఈలాటి స్పందనను రేకెత్తించవచ్చు: “తప్పకుండా మనం కనికరాన్నే కోరాలి, మరియు కనికరం పొందడానికి మనం ఏమి చేయగలమో దాన్ని చేయాలి.” అది నిజమే, కాని ఆ వాంఛ మరియు ఆ ప్రయాస కనికరమునకు హామీ కాదని పౌలు స్థాపించుతున్నాడు. వాంఛించడం, పని చేయడం అనేవి దేవుణ్ణి మనపట్ల రుణస్థునిగా చేయవు. ఎవని మీద కనికరాన్ని ప్రసాదించబోతాడో తీర్మానించుకోడం దేవునికి గల హక్కు.

అరణ్యంలోని ఇశ్రాయేలీయులు యిందుకుగాను మంచి ఉదాహరణమై ఉన్నారు.

ఈ సందర్భం యొక్క కొటేషన్ నిర్గమమునుండి తీయబడింది. మోషే ఇశ్రాయేలీయుల పట్ల విన్నవించుకొంటూ, వారిని క్షమించుమని అతడు దేవుని వేడుకొంటున్నాడు (నిర్గమకాండము 32:31, 32ఎ), వారితో కూడ కొనసాగునట్లు అడుగుతున్నాడు (33:15). ఈ కనికరపు ప్రదర్శనలకు ఇశ్రాయేలీయులు పాత్రులా? లేదు, ఆ సందర్భంలో దేవుడు వారిని కనికరింపగోరుకున్నాడు. వారి పితరులకు కృపను దేవుడు విస్తరింప జేయడం న్యాయమేనని పౌలు యొక్క యూదులైన పాఠకులు నమ్ముతారా? నమ్ముతారు.

**కఠినపరచబడడం: దైవిక నివారణ (17, 18 వచనాలు)**

వచనం 17లో పౌలు నిర్గమానికి ముందటి కాలానికి జరిగిపోయాడు: "మరియు లేఖనము ఫరోతో ఈలాగు చెప్పెను,[2] 'నేను నీయందు నా బలము చూపుటకును, నా నామము భూలోకమందంతట[3] ప్రచురమగుటకును, అందు నిమిత్తమే నిన్ను నియమించితిని.' " ఈ కొటేషన్ నిర్గమకాండము 9నుండి తీయబడింది. ఇది ఆరవ తెగులైన పొక్కులు పొక్కు దద్దురులకును, ఏడవ తెగులైన వడగండ్లకును మధ్య, దేవుడు మోషేచేత ఫరోకు ఒక సందేశాన్ని పంపాడు. అతనిని, ఐగుప్తునంతటిని ఆయన నశింప జేసియుండేవాడే. కాని, మోషే ద్వారా ఫరోకు యెహోవా యిలా తెలిపారు: "నా బలమును నీకు చూపునట్లును, భూలోకమందంతట నా నామమును ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని" [అక్షరార్థంగా, "నిలిపితిని"[4]] (నిర్గమకాండము 9:16). నిర్గమకాండంలోని మూల వాక్యానికిని పౌలు కొటేషన్‌కును కొంచెం వ్యత్యాస ముంది. "అందు నిమిత్తమే నిన్ను [రాజుగా] నియమించితిని" అని పౌలు అన్నాడు. పాత నిబంధనలో "ఇందుకే నేను నిన్ను [రాజుగా] నియమించితిని." ఎటు చూచినా దేశముల గతిని దేవుడు తన స్వాధీనంలో ఉంచుకున్నట్టు నొక్కి చెప్పబడుతుంది.

"నా జనులను పోనిమ్ము" అనే దైవికమైన ఆదేశానికి ఫరో ఎలా ప్రత్యుత్తరమిచ్చినా సరే దేవుని ఉద్దేశం నెరవేర్చబడియుండేదేనని మనం ఎరగాలి (నిర్గమకాండము 5:1). ఫరో లోబడియుండినట్టయితే, ఐగుప్తు దేశపు మహా రాజు ఇశ్రాయేలీయుల దేవుని ఆదేశాలకు లోబడ్డాడనే వార్త వ్యాపించేదే. తత్ఫలితంగా, దేవుని యొక్క శక్తి ప్రదర్శింపబడేదే ఆయన నామము భూలోకమందంతట ప్రచురమయ్యేదే. ఫరో నిరాకరించాడనుకో. తత్ఫలితంగా పది తెగుళ్లు వాటివెంట నిర్గమము, ఎఱ్ఱ సముద్రాన్ని దాటడం, ఐగుప్తు సైన్యం లయమవ్వడం లాంటివి జరిగాయి. బలీయమైన ఆ కార్యముల సమాచారం ఎంతో దూరం వ్యాపించింది (యెహోషువ 2:10, 11; 9:9; 1 సమూయేలు 4:8 చూడు).

దేవుడు ఫరోతో ఎలా వ్యవహరించాడో పౌలు వివరాలు యివ్వలేదు, ఎందుకంటే బడికి వెళ్లిన ప్రతి బాలునికి ఆ కథ తెలుసు. పౌలు తన పాఠకుల దృష్టిని కేంద్రీకరింప జేయగోరిన కీలక విషయం ఫరో హృదయాన్ని కఠినపరచడం. దేవుడు "ఎవని కఠినపరచగోరునో వాని కఠినపరచును" అని పౌలు వచనం 18లో చెప్పాడు. కఠిన

హృదయము నమ్మని, మొండి, లోబడనొల్లని హృదయం. “దేవునికి, ఆయన వాక్యానికి, ఆయన పనికి ఇంద్రియ జ్ఞానములేని స్థితి” అని Douglas J. Moo వ్రాశాడు.[5]

దేవుడు ఫరో హృదయాన్ని ఎలా (ఏ భావంలో) కఠినపరచాడో చర్చించుతూ జనులు గంటలు గడిపారు. మనం పది తెగుళ్లను గూర్చి చదివేటప్పుడు, దేవుడు ఫరో హృదయాన్ని కఠినపరచినట్టు సమయంలో కొంత భాగం అంటుంది (నిర్గమకాండము 9:12; 10:1, 20, 27; 11:10; 14:8), మరికొంత భాగం ఫరో తన హృదయాన్ని కఠినపరచు కొన్నట్టు అది అంటుంది (నిర్గమకాండము 7:13, 14, 22; 8:15, 19, 32; 9:7, 34, 35). “నా జనులను పోనిమ్ము” అని మోషే చెప్పడం ద్వారా పరోక్షంగా దేవుడు ఫరో హృదయాన్ని కఠినపరచాడని, దేవుని రాజ శాసనాన్ని ఆలకించ నిరాకరించుటవలన ఫరో తన సొంత హృదయాన్ని కఠినపరచుకున్నాడని అనేకమంది రచయితలు తీర్మానించారు. “ఇక్కడే గాని మరి యింకెక్కడే గాని మొదట తన్నుతాను కఠినపరచుకొనని ఎవనినైనను దేవుడు కఠినపరచినట్టు చెప్పబడలేదు” అని Leon Morris అన్నాడు.[6]

సూర్య కిరణాలు వెన్నమీద, బురదమీద ఎలాటి ప్రభావాన్ని కనుపరచుతాయో అనేది తరచుగా ఉపయోగించే ఉదాహరణయైయుంటుంది. వెన్నను కరిగించిన అదే కిరణాలు బురదను గట్టిపరుస్తాయి. ఆలాగే, దేవుడు మాట్లాడినప్పుడు, కొందరి హృదయాలు మెత్తన చేయబడుతుండగా, మరికొందరి హృదయాలు కఠినమౌతాయి. దేవుని వాక్యం ఫరో హృదయాన్ని కఠినపరచింది ఎందుకంటే (నేను యిలా చెప్పినట్టయితే) అది “బురదతో చేయబడింది.”

దేవుడు ఫరో హృదయాన్ని ఎలా కఠినపరచాడో అనే దానిమీద నేడు జనులు పెనుగులాడతారు. యూదులైన తన శ్రోతలకు వివాదాస్పదమైన విషయాన్ని పౌలు లేవనెత్తలేదని మనం గ్రహించాలి. దేవుడు ఫరో హృదయాన్ని కఠినపరచాడని చదివి అతని విషయమై చింతించిన కొద్దిమందిని నేను కలిసికొన్నాను. కాని యూదుల హృదయాల్లో ఫరో పట్ల జాలి ఎవరికీ లేదు. వారికి సంబంధించినంతమట్టుకు, అణచివేసిన ఆ ఏలికకు దేవుడు ఏమి కోరుకుంటాడో దాన్ని చేయడానికి ఆయనకు హక్కు ఉన్నట్టు వారు భావించుతారు.

అప్పుడు పౌలు ఒక సంగ్రహమైన ప్రతిపాదనను చేశాడు: “కావున ఆయన ఎవనిని కనికరింపగోరునో వానిని కనికరించును; ఎవని కఠినపరచగోరునో వాని కఠినపరచును” (రోమా 9:18). “మీ పితరుల మీద కనికరము చూపినప్పుడు, దేవుడు న్యాయవంతుడేనా?” అని నీవు యూదుని అడిగియుండినట్టయితే, “అవును” అని చెప్పియుండేవాడే. “ఫరో హృదయాన్ని కఠినపరచినప్పుడు, దేవుడు న్యాయవంతుడేనా?” అని నీవు అతనిని అడిగియుంటే “పరిపూర్ణంగా!” అని అతడు బదులిచ్చేవాడే. ఈ విధంగా, కొందరిని అంగీకరించి, యితరులను నిరాకరించడం దేవునికి న్యాయమే అనేది సంవత్సరాలనుండి దేవుని ఆచరణతో అనుగుణంగా ఉందని పౌలు స్థాపించుతున్నాడు. ఆయన ఎల్లప్పుడు కొందరిని అంగీకరించి యితరులను నిరాకరిస్తునే ఉన్నాడు.

## ఆయన వ్యక్తిత్వంతో పొందికగానుండు (9:19-21)

ఏర్పాట్లు చేసికొనడంలో దేవుడు న్యాయవంతుడు ఎందుకంటే ఆయన తన వ్యక్తిత్వంతో పొందిక కలిగియుంటాడు. అంటే, ఆయన ఏర్పాట్లు ఆయన ఏమైయున్నాడో ఆయన స్వభావము ఏమైయుందో దానికి అనుగుణంగానే ఉంటాయి.

### ప్రేరేపించు ప్రశ్న (19 వచనం)

పౌలు తన ఆలోచనను, ఆక్షేపణను ఎదురు చూస్తూ ప్రవేశపెట్టాడు: "అట్లయితే 'ఆయన చిత్తమును ఎదిరించినవాడెవడు? ఆయన ఇకను నేరము మోపనేల?' " (19 వచనం). ఈ వచనంలో ఆక్షేపించినట్టు ఊహించబడినవాడు యూదుడు కాకపోవచ్చు (వచనం 7 మధ్యలోనుండి ఆరంభించి), యింతవరకు యూదుడు అంగీకరింపని ఏ విషయాన్ని పౌలు తన వాదనలో తెలుపలేదు. గనుక, మనం వచనం 19కి వచ్చి చేరగా, పౌలు తన సాటి యూదుని పక్షంగానే నిలిచి, తన ఊహలో వ్యతిరేకించినవానిని ఎదుర్కొంటున్నట్టు మనం చిత్రించవలసియుంటుంది. వచనం 20లో పౌలు అతనిని "ఓ మనుష్యుడా" అని సంబోధిస్తున్నాడు. ఈ వ్యక్తి యొక్క ఫిర్యాదు యివ్వబడింది: "దేవునికి ఎదురు చెప్పుటకు నీవెవడవు? [18 వచనం చూడు] నన్నెందుకీలాగు చేసితివని రూపింపబడినది రూపించినవానితో చెప్పునా?"

దైవికమైన భవిష్యత్ జ్ఞానము మీద జరిగే చర్చలలో ఈలాటి ప్రశ్నలు ప్రముఖ స్థానంలో ఉంటాయి. దేవుడు ముందుగా ఎరిగి, కొన్ని సందర్భాలలో ఫలాని వ్యక్తి, ఫలాని పని చేస్తాడని ముందుగా చెప్పియున్నట్టయితే, ఆ వ్యక్తి చేసినదానికి అతనిని ఎందుకు బాధ్యుడైనట్టు ఎంచాలి? దేవుని చిత్తాన్ని ప్రతిఘటించగలవాడెవడు? వచనం 19లో ఈ ప్రశ్నలు మనం చదువుచుండగా, పౌలు ఎలా బదులిచ్చాడో వినడానికి మనం ఆతురత కలిగియున్నాం.

### ఆశ్చర్యాన్ని కలిగించే జవాబు (20, 21 వచనాలు)

ఎలా జవాబు చెప్తూతాడని మనం ఎదురు చూస్తాం. ఆ విధంగా పౌలు జవాబు చెప్పలేదు. దేవుని సర్వాధిపత్యానికిని, మానవ స్వేచ్ఛా చిత్తానికిని మధ్యగల సంబంధాన్ని దీర్ఘంగా చర్చించడానికి అతడు వెళ్లలేదు. అయితే, దేవుడు మనిషికి జవాబుదారీ కాడు అనేది అతని ప్రాథమిక జవాబైయుంది. ఆయన దేవుడైయున్నాడు సుమీ!

"అవును గాని ఓ మనుష్యుడా, దేవునికి ఎదురు చెప్పుటకు నీ వెవడవు?" (20ఎ వచనం). ఈ ప్రశ్నలో రెండు పదాలు తారతమ్యం చేయబడ్డాయి: "మనుష్యుడు" (*anthropos*[7]) మరియు "దేవుడు" (*theos*). ఒకవైపు నిమిత్తమాత్రుడు, పరిమితుడు, అల్పుడు, విషయ పరిజ్ఞానం లేనివాడు; మరోవైపు అనంతుడు, అపరిమితుడు, సర్వశక్తుడు, సర్వమునెరిగిన దేవుడు. "దేవునితో తిరిగి మాట్లాడడాన్ని కేవలం నరమాత్రుడా, నీవు ఏపాటివాడవు?" అంటూ ఆ తారతమ్యాన్ని వచనం 20 తొలి భాగాన్ని CJB ఎత్తి చూపుతుంది.

నరమాత్రుడు తిరిగి దేవునితో మాట్లాడడంలోని వైపరీత్యాన్ని చూపడానికి,

యూదులకు ఎరుకైన ఒక పోలికను పౌలు ఉపయోగించాడు: మట్టి పాత్రలు చేయువాడు (కుమ్మరి) మట్టి పాత్ర (యెషయా 29:16; 45:9; 64:8; యిర్మీయా 18:6 చూడు). "నన్నెందుకీలాగు చేసితివని రూపింపబడినది రూపించినవానితో చెప్పునా? ఒక ముద్దలో నుండియే యొక ఘటము ఘనతకును ఒకటి ఘన హీనతకును చేయుటకు మంటిమీద కుమ్మరివానికి అధికారము లేదా?" (రోమా 9:20బి, 21).

చక్రం మధ్య మంటి ముద్దను అతడు పెట్టి, చక్రాన్ని త్రిప్పుతూ, ఆ మంటి ముద్దను నేర్పుగా ఒక పాత్రగా రూపించుతాడు. అది "ఘనత కొరకు వాడబడే" "మనోహరమైన పాత్ర" (Phillips) లేదా అది "సాధారణమైన పనులకు వాడబడే" "చెత్తకుప్పను వేసే" పాత్ర కావచ్చు (NLT). "ఘనతకొరకు వాడబడేది" మరియు "సాధారణమైన పనులకు వాడబడేది" అనేవాటికి బదులుగా గ్రీకు మూలంలో, "ఘనత," "ఘన హీనత" అనే పదాలు వాడబడ్డాయి. ప్రత్యేకమైన తన ప్రజలుగా దేవుడు ఇశ్రాయేలీయులను ఏర్పరచు కొనడమే (4, 5 వచనాలు) "ఘనత" కొరకు చేయబడిన పాత్రకు ఉదాహరణయై ఉన్నారు. ఫరో "ఘన హీనత" కొరకు చేయబడిన పాత్రకు ఉదాహరణ అయ్యుండవచ్చు. మంటిమీద కుమ్మరివానికి అధికారముందని పౌలు అంటున్నాడు. మరియు "రమ్యమైన పాత్రగా నన్నెందుకు చేయలేదు?" అని చెత్త కుప్ప వేయబడే పాత్ర సహితము ఎన్నడూ ఫిర్యాదు చేయలేదు.[8]



అన్ని పోలికలవలెనే దీనిని కూడా బహు దూరంగా సాగదీయ కూడదు. మొదట, ప్రజలు ప్రాణంలేని మంటి ముద్దలు కారు. వారు దేవుని ప్రతిఘటించగలరు; దేవుడు వారిని ఎలా చేశాడో దాన్ని గూర్చి తరచుగా వారు ఫిర్యాదు చేస్తారు. (నేనెందుకు యింత పొట్టిగా ... పొడవుగా ... లావుగా ... సన్నగా ... ఉన్నాను?) రెండవది, "జిగటమంటి" యొక్క తరహాను బట్టి అది ఏ విధమైన పాత్రగా చేయబడవలెనో, ఎలా ఉపయోగింపబడవలెనో ఆధారపడియుంటుంది (యిర్మీయా 18:1-10; 2 తిమోతి 2:20, 21లను చూడు). ఫరో విషయంలో అది నిశ్చయముగా వాస్తవమైయుంటుంది. అయినా పౌలు యొక్క ఆలోచన చట్ట ప్రకారం చెల్లునదైయుంది; దేవుడు దేవుడై యున్నాడు, ఆయన తాను కోరుకున్నదానిని జరిగింప హక్కు గలవాడైయున్నాడు.

వచనం 19 యొక్క ప్రశ్నకు బదులివ్వడానికి పౌలు ప్రయాసపడలేదని మనలో కొందరు నిరాశపడవచ్చు; గాని యూదులకు చెప్పుకునే విధానంలో తన ఆలోచన రూపించబడిందని మనస్సులో ఉంచుకో. ఇష్మాయేలుకు పైన ఇస్సాకును, ఏశావుకు పైన యాకోబును దేవుడు ఏర్పరచుకొనడం అన్యాయమని, లేక యెహోవా ఫరో హృదయాన్ని కఠినపరచిన తరువాత తిరుగుబాటు చేసిన ఇశ్రాయేలీయులను ఉండనీయడం అన్యాయమని ఒక యూదేతరుడు అంటే ఏమౌతుంది? "నిన్ను గూర్చి నీవు ఏమనుకుంటున్నావు? దేవుని ప్రశ్నించడానికి నీకేమి హక్కుంది?" అని జగడానికి వచ్చే యూదుని ఊహించడం కష్టం కాదు. తన ఏర్పాట్ల విషయంలో దేవుని ప్రశ్నించడానికి యూదునికి కూడ హక్కు

లేదనే తీర్మానాన్ని పౌలు ఎదురు చూస్తున్నాడు.

"దేవుడు న్యాయవంతుడా?" అనే ప్రశ్నకు సంబంధించి, పౌలు యొక్క రెండవ పాయింటును మనం ఈ విధంగా వ్యక్తపరచవచ్చు: "దేవుడు న్యాయవంతుడు ఎందుకంటే దేవుడు దేవుడైయున్నాడు – మరియు ఆయన జరిగించే ఏదైనా ఆయన స్వభావానికిని, ఆయన ఏమైయున్నాడో దానికిని అనుగుణంగా ఉంటుంది." దేవుడు తాను జరిగించే వాటిని ఎందుకు చేస్తున్నాడో కొన్నిసార్లు నీవు నేను గ్రహించలేకపోవచ్చు (మనం కేవలం నరమాత్రులమే) ఆయన సరియైనదే చేస్తాడని ఆయనను మనం నమ్ముకోవచ్చు. అబ్రాహాము అన్నట్టే, "సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు న్యాయము చేయడా?" (ఆదికాండము 18:25).

## ఆయన ఉద్దేశంతో పొందిక కలిగియుండుట (9:22-29)

కొందరిని స్వీకరించి, కొందరిని నిరాకరించే హక్కు దేవునికి ఉన్నదని స్థాపించిన మీదట, (యూదులైనా, అన్యజనులైనా) అవిశ్వాసులకు పైగా విశ్వాసులను దేవుడు ఏర్పరచుకునే ప్రత్యేకమైన ప్రశ్నవైపుకు పౌలు తిరిగాడు. వచనం 22తో ఆరంభించి వచనం 29వరకు దేవుని న్యాయ విధానమునకు పౌలు రుజువునిచ్చాడు. ప్రత్యేకించి, దేవుని ఏర్పాట్లు న్యాయమైనవి ఎందుకంటే అవి ఆయన ఉద్దేశంతో పొందిక కలిగి ఉంటాయి – పాత నిబంధన ప్రవక్తల ద్వారా ముందుగా ఆయన ప్రకటించిన ఉద్దేశమే.

### దేవుని ఉద్దేశం నెరవేర్చబడింది (22–24 వచనాలు)

గ్రీకులో 22నుండి 24 వచనంవరకు ఒకే వాక్యం (KJV చూడు). గ్రీకులోని మాటల అమరిక చిక్కుగాను, తికమకగాను ఉన్నట్టు కన్పిస్తాయి, కాని పౌలు యొక్క ప్రాథమిక సందేశం తేటగా ఉంది. ఆ వాక్యం అపొస్తలుడు అడుగుతున్నట్టు ప్రారంభిస్తుంది, "ఆలాగు దేవుడు తన ఉగ్రతను అగపరచుటకును, తన ప్రభావమును చూపుటకును, ఇచ్ఛయించినవాడై, నాశనమునకు సిద్ధపడి ఉగ్రతాపాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో సహించిననేమి[9]?" (22 వచనం).

ఈ వచనాన్ని అర్థం చేసికొనడానికి, దీన్ని విడదీసి, ముక్కలు, ముక్కలుగా చూడడంవలన సహాయం చేస్తుంది. దేవుడు "తన ఉగ్రతను అగపరచుటకును, తన ప్రభావమును చూపుటకును, ఇచ్ఛగలవాడై." ఈ సందర్భంలో, దేవుడు ఫరోకు తెలిపిన మాటలను యిది సూచించవచ్చు (17 వచనం చూడు), కాని యివి ఒక సాధారణ నిజాన్ని కూడ తెలుపుతున్నాయి. అంతంలో, తన ఉగ్రత భక్తిహీనులపై పడునప్పుడు, దేవుని శక్తి ప్రదర్శింపబడుతుంది (1:18 చూడు).

తీర్పు రాబోతున్నా, "ఉగ్రతా పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘ శాంతముతో సహించుతున్నాడు." జిగట మన్ను, కుమ్మరి పోలికను పౌలు కొనసాగిస్తున్నాడు, అయితే వ్యత్యాసమైన వర్తింపుతో (కొనసాగిస్తున్నాడు). "నాశనమునకు

సిద్ధపడిన ఉగ్రతా పాత్రమైన" "దీర్ఘకాలము సహింపబడిన ఘటానికి" ఫరో మంచి ఉదాహరణయైయున్నాడు. ఇశ్రాయేలీయులను పోనిచ్చునట్లు అతని మనస్సు మార్చుకొనడానికి దేవుడు ఫరోకు తరుణం వెంట తరుణం ప్రసాదించుతునే వచ్చాడు. మరో ఉదాహరణ, అరణ్యంలోని ఇశ్రాయేలీయులు. ఆయన "బహు దీర్ఘశాంతముతో [వారిని] సహించకపోయినట్టయితే," జనాంగంగా వారు ఎన్నడో తుడిచిపెట్టుకు పోయేవారే. పాత నిబంధన కాలంలో భక్తిహీనులైన అన్యజనులకు కూడ ఈ సూత్రము వర్తింపజేయ బడవచ్చు. "నాశనమునకు సిద్ధపడి ఉగ్రతా పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో" యింకను సహించుతునే ఉన్నాడు. ఎందుకంటే, మారుమనస్సు పొందడానికి ఆయన మనకు అవకాశాలను ప్రసాదిస్తున్నాడు (2:4 చూడు). "... ప్రభువు ... యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు" అని పేతురు వ్రాశాడు (2 పేతురు 3:9). దేవుడు తన ఉగ్రతను కుమ్మరించే దానికంటెను ఆయన కనికరమును కనుపరచువాడైయున్నాడు.

ఇదంతా మనస్సులో ఉంచుకొని, వచనం 22లోని ప్రశ్నతో మనం ఆరంభించిన ప్రశ్నను కలుపుదాం. వచనం 14లోని ప్రశ్న: "దేవుడు న్యాయవంతుడా?" (లేక "దేవునియందు అన్యాయము కలదా?"; NCV). వచనం 22లో, "నశించినవారికి మారుమనస్సు పొందే అవకాశాన్ని యిస్తూ శాంతంతో ఉన్న దేవుని సంగతి ఏమిటి?" "దేవుడు ఎంత న్యాయవంతుడో అనడానికి యిది నిదర్శనము కాదా?"; "తప్పకుండా!" అని వచనం 22లో ప్రశ్న, జవాబులు గుప్తమైయున్నాయి.

"[మారుమనస్సుకు నశించినవారిని తెచ్చుటకు ఆయన దీర్ఘశాంతము గలవాడై యుండి] మహిమ పొందుటకు ఆయన ముందుగా సిద్ధపరచిన కరుణాపాత్ర ఘటముల యెడల ... తన మహిమైశ్వర్యము కనుపరచవలెననియున్ననేమి?" అంటూ వచనం 23 సాగింది. "కరుణా పాత్ర ఘటముల యెడల తన మహిమైశ్వర్యమును కనుపరచవలె ననునది" నిర్గమము మరియు సీనాయి పర్వతము వద్ద ఇశ్రాయేలీయులను కనికరముతో బ్రదుకనిచ్చుట అనే కథ మనకు గుర్తొస్తుంది (15, 18ఎ వచనాలు). ఆ సందర్భంలో దేవుడు చేసినది యావత్తు ఆయన కనికరము యొక్క "ఐశ్వర్యాన్ని" కనుపరచుతోంది.

ఫరో, ఇశ్రాయేలీయుల ఉదాహరణలనుండి, చర్చలోని విషయాన్ని వర్తింపజేయడానికి పౌలు సిద్ధంగా ఉన్నాడు. "కరుణాపాత్ర ఘటములను" సూచించిన తరువాత అపొస్తలుడు యిలా చేర్చాడు, "మహిమ పొందుటకు ఆయన ముందుగా సిద్ధపరచి పిలిచెను" అని అన్నాడు (23బి, 24ఎ వచనాలు). "ముందుగా సిద్ధపరచి," "పిలిచెను" అంటే, ఆయన ఎవరిని ముందుగా ఎరిగెనో లేక ముందుగా నిర్ణయించెనో (8:29, 30)[10] – వేరుగా చెప్పాలంటే దేవుని కృపచేత రక్షింపబడినవారని.

"ఆయన పిలిచిన మనలను" అని సూచించిన తరువాత (9:24ఎ), "అనగా యూదులలోనుండి మాత్రము కాక, అన్యజనులలోనుండియు" అంటూ పౌలు వివాదపు కేంద్ర స్థానానికి వెళ్లాడు (24బి వచనం). అనేకమంది యూదులను దేవుడు నిరాకరించెను అనేదే యూదులకు చాలినంత కలవరం కలిగిస్తుంది. అదే

సమయంలో, దేవుడు అనేక మంది అన్యజనులను అంగీకరించెను అనేది వారికి మరీ కుదురుబాటులేని స్థితిని కల్పించింది. వాస్తవానికి, ఆయన యూదులకంటెను ఎక్కువమంది అన్యజనులనే అంగీకరించాడు.[11] శతాబ్దాలకు ముందు దేవుడు యూదా జాతితో చేసిన నిబంధనను దృష్టిలో ఉంచుకుంటే యిది న్యాయంగా ఉంటుందా?

**దేవుని ఉద్దేశం ముందుగా చెప్పబడింది (25–29 వచనాలు)**

ఈలాటి పరిస్థితులు ప్రవక్తలచే ముందుగానే ప్రవచింపబడుతుందనేది పౌలు జవాబై యుంది. దేవుని ఏర్పాట్లలోను, సంకల్పంలోను అన్యజనులు చేర్చబడడం అనుకూల మయ్యిందేనని రుజువు చేయడానికి ప్రవక్తయైన హోషేయనుండి పౌలు మొదటిగా రెండు లేఖన భాగాలను కోట్ చేశాడు; ఆ ప్రకారము:

> "నా ప్రజలు కానివారికి 'నా ప్రజలనియు,'
> ప్రియురాలు కానిదానికి 'ప్రియురాలనియు' పేరు పెట్టుదును
> [హోషేయ 2:23]."
> "మరియు జరుగునదేమనగా, 'మీరు నా ప్రజలు కారని'
> యేచోటను వారితో చెప్పబడెనో,
> ఆ చోటనే జీవముగల దేవుని కుమారులని
> వారికి పేరు పెట్టబడును అని హోషేయలో
> ఆయన చెప్పుచున్నాడు[12] [హోషేయ 1:10]" (రోమా 9:25, 26).

హోషేయలోని వచనాలను వాటి సందర్భంలో చదువు, హోషేయ అన్యజనులను గూర్చి గాక, వెనుదిరిగిన యూదులను గూర్చియన్నట్టు నీవు కనుగొంటావు. దైవ ప్రేరేపణ వలన పౌలు ఈ లేఖన భాగాన్ని ఉపయోగిస్తూ ఒక సూత్రాన్ని స్థాపించుతున్నాడు: దేవుని ప్రజలు కానివారు దేవుని ప్రజలయ్యే వీలుందనడానికి ఈ లేఖన భాగం వాడబడింది. అందువలన, దేవుని ప్రజలు కాని అన్యజనులు (ఎఫెసీయులకు 2:11, 12 చూడు). దేవుని ప్రజలు (క్రైస్తవులు)గా అవడమనేది దేవుని ఉద్దేశాలకు అనుగుణంగా ఉంది.

(యేసునందు విశ్వాసముంచిన) కొద్దిమంది ఇశ్రాయేలీయులను అంగీకరించి ఇశ్రాయేలు దేశంలో అత్యధికులను నిరాకరించిన వాస్తవాన్ని గూర్చి ఏంటి (రోమా 9:6బి చూడు)? విషయం యిలాగైయుంటుందని ప్రవక్తలు కూడ ప్రవచించారని పౌలు చెప్పాడు. ఈసారి అతడు యెషయాను కోట్ చేశాడు:

> "మరియు **ప్రభువు** తన మాట సమాప్తము చేసి, క్లుప్తపరచి[13] భూలోకమునందు దానిని నెరవేర్చును గనుక ఇశ్రాయేలు కుమారుల సంఖ్య సముద్రపు ఇసుకవలె ఉండినను [ఆదికాండము 22:17 చూడు], శేషమే రక్షింపబడునని" యెషయాయు ఇశ్రాయేలును గూర్చి బిగ్గరగా పలుకుచున్నాడు (రోమా 9:27, 28; యెషయా 10:22, 23 చూడు).

ఈ లేఖన భాగంలో కీలకమైన పదం "శేషము" (*hupoleimma*) "చిన్న సంఖ్యను" సూచిస్తుంది.[14] యెషయా 10:22, 23 సందర్భాన్ని నీవు చదివావంటే, చెరలోనుండి

కనానుకు చేరుకునే శేషమును గూర్చి ప్రవక్త మాట్లాడుతున్నట్టు నీవు గమనించగలవు. మరల, పౌలు దైవ ప్రేరేపితమైన వర్తింపు చేస్తున్నాడు. పాత నిబంధనలో, యూదా యొక్క శేషమే చెరనుండి రక్షింపబడింది. ఇశ్రాయేలు యొక్క శేషమే క్రొత్త నిబంధన యుగంలో రక్షింపబడిందంటే ఆశ్చర్యపడనక్కర లేదు.

"శేషము" యొక్క సందేశం రెండు విధాలు. మొదట, కేవలం శేషం మాత్రమే రక్షింపబడుతుందనే వార్త విషాదకరమైనది. రెండవది, శేషమైనా రక్షింపబడుతుందనేది శుభవార్త కూడా (రోమా 11:5 చూడు). ఇశ్రాయేలీయులందరు నిరాకరింపబడలేదు. యెషయానుండి కోట్ చేస్తూ సందేశంలో రెండో భాగాన్ని పౌలు తెలియజేస్తున్నాడు: "మరియు యెషయా ముందు చెప్పిన ప్రకారము, 'సైన్యములకు అధిపతియగు **ప్రభువు,** [hosts[15]] మనకు సంతానము శేషింపచేయకపోయినయెడల సొదొమవలెనగుదుము, గొమొఱ్ఱాను పోలియుందుము' " (9:29; యెషయా 1:9 చూడు).

అష్షూరీయులు దేశంపై దండెత్తినప్పుడే, యూదాకును, యెరూషలేముకును ఇబ్బందిగానుండిన సమయాన్ని యెషయాలోని లేఖన భాగం సూచిస్తుంది. ముందు, దేవుడు సొదొమ, గొమొఱ్ఱాను భూతలమునుండి తుడిచివేశాడు (ఆదికాండము 19:24, 25 చూడు) – అవి ఎంత శుద్ధంగా తుడిచివేయబడ్డాయంటే, ఆ పట్టణాలు ఎక్కడ ఉండినవో కనీసం తెలిసికోలేని పరిస్థితి. అష్షూరు దండెత్తినప్పుడు, యూదులకు అలా సంభవించ లేదు. కాని శేషము విడిచిపెట్టబడింది, విత్తనాలు మొలకెత్త విడిచిపెట్టబడ్డాయి. ఆలాగే, పౌలు దినాల్లో సహా దేవునికి ఆయన శేషం ఇశ్రాయేలులో ఉంది – పౌలువలె యేసును మెస్సీయగా అంగీకరించిన యూదులు (11:1 చూడు). ఈ జనుల ద్వారా దేవుడు తన ఉద్దేశాలను నెరవేర్చుకుంటాడు.

## ముగింపు

దేవుడు ఇశ్రాయేలీయులతో శతాబ్దాల తరబడి పని చేశాడు. అలాటప్పుడు, దేవుని సంకల్పములో ఇశ్రాయేలులో కేవలం శేషమే మిగిలియుండడానికి హేతువేమి? తన పత్రికలోని తరువాత భాగంలో పౌలు ఆ ప్రశ్నకు జవాబు యిచ్చాడు.

ఈ పాఠంలో, కొందరిని ఏర్పరచుకొనడం, కొందరిని నిరాకరించడంలోని దేవుని న్యాయాన్ని చర్చించాం. పౌలు చర్చించిన ప్రత్యేకమైన సమస్యలు నేటికి సంబంధించినవి కాకపోయినా, దేవుడు న్యాయవంతుడనే ఈ సత్యం నీ మనస్సులో ముద్రించబడిందని నేను నిరీక్షిస్తున్నాను: ఆయన న్యాయవంతుడు; ఆయన తీర్పు తీర్చువాడు; ఆయన నీతిపరుడు. దేవుడు న్యాయవంతుడు కాదని ఎవడైనా చెప్పబూనుకొన్నప్పుడు, అతడు దేవుని గూర్చి గాక తన్నుగూర్చియే అధికంగా చెప్పుకొంటున్నాడు. అతడు తన సొంత విషయ పరిజ్ఞాన లేమిని, అవిశ్వాసాన్ని బయటపెట్టుకున్నవాడైయుంటాడు.

ఏదియెలాగున్నా, దేవుడు న్యాయవంతుడని మన మూల వాక్యము ప్రకటించుట మాత్రమే గాక, ఆయన కనికరము గలవాడని కూడ అది ప్రకటిస్తుంది. అధ్యాయాలు 9నుండి 11ల్లో "కీలక పదం," "కనికరము"[16] అని అభిప్రాయపడ్డాడు. ఈ పదం యొక్క నామవాచకం, క్రియావాచక రూపాలు ఈ అధ్యాయాల్లో 9 సార్లు కన్పిస్తాయి.

ఈ పత్రికలోని మిగిలిన అధ్యాయాల్లో ఒకదానిలో ఒకటి మాత్రమే కన్పిస్తుంది.[17] దేవుడు న్యాయవంతుడు గనుక నేనాయనకు కృతజ్ఞుడనైయున్నాను. కాని ఆయన కనికరము గలవాడు కూడా అయ్యున్నందున నా హృదయమంతటితో ఆనందిస్తున్నాను. ఇది వాస్తవమైనందున, నేను శాశ్వతంగా రక్షింపబడతాననే నిరీక్షణ నాకుంది!

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ పాఠం ఉపయోగించినప్పుడు, దేవుని కనికరముపైన ముగింపు – విధేయతతో కూడిన విశ్వాసంతో దేవుని కనికరాన్ని ఎలా సద్వినియోగం చేసికోవాలో ఆ చర్చకు నడిపించవచ్చు.

మన మూల వాక్యంలో ఆ యా చోట్ల ఆగి నీ శ్రోతలకు వ్యక్తిగతంగా వర్తింప జేయవచ్చు. దీనిలోని భాగాలు తీసికొని కూడ అంశ పాఠాలుగా ఉపయోగించ గోరవచ్చు. ఉదాహరణకు, కనికరము అనే చర్చనీయాంశం 15, 16, మరియు 18 వచనాలలో ప్రత్యేకంగా చూపవచ్చు.

దేవునివైపు తిరిగి ప్రజలు మాట్లాడటం వర్తింపుకు, చర్చకు నడిపించేది (20 వచనం). నేడు, "నన్నెందుకు యిలా చేశావు?" అని కొందరు అడుగుతారు. భౌతికంగా, మానసికంగా, ఉద్వేగంగా మనం చేయబడిన విధానం మనపై పరిమితులను విధిస్తుంది. మనకు ఏమి సంభవించినా ప్రశ్నించడం ఎప్పుడు సరియైనది, ఎప్పుడు తప్పో అనే చర్చను వచనం 20 ప్రవేశపెడుతుంది. Walter W. Wessel యిలా రాశాడు, "నరుడు దేవుని ఏ ప్రశ్నయు అడుగకుండ పౌలు నోరు మూయించడం లేదు, కాని మారుమనస్సు లేని, దేవుని ధిక్కరించు స్వభావం గలవారితో, తాను చేసేదానికి దేవుని జవాబుదారిగా చేయగోరి, వారి ప్రశ్నలవలన దేవుని శీలాన్ని అవమానం చేసేవారిని గూర్చి పౌలు మాట్లాడాడు."[18] "దేవుని గ్రహింపగల మానవ సామర్థ్యాన్ని మించి దేవునియందు నమ్మికయుంచడానికి నరుడు పిలువబడ్డాడు. దేవుని చర్యలకు హేతుబద్ధంగా వివరించే ప్రయత్నాలు భ్రష్టత్వపు భక్తిహీనులకు సంబంధించినవి, దేవుని కార్యములు మానవ హేతువుకు అంగీకారంగా చేయాలనే వాంఛ ఆలాటివారికి కలుగుతుంది" అని Richard Batey గుర్తించాడు.[19]

---

సూచనలు

[1]ఈ లేఖన భాగంలో, "కనికరించు" (*eleeo*) "దయగలిగియుండు" (*oikteiro*), అనేవి దాదాపు పర్యాయ పదాలుగా ఉపయోగించ లేదు. [2]ఈ మాటలు అసలు ఫరోచే పలుకబడ్డాయి (నిర్గమకాండము 9:13, 16), కాని తరువాత అవి భవిష్యత్ తరాల ప్రయోజనం కొరకు లిఖించబడ్డాయి. [3]ఫరో హృదయాన్ని కఠినపరచడం, అరణ్యంలో ఇశ్రాయేలీయులను కనికరించడం తన సంకల్పాన్ని కొనసాగించేవే గాని, కొందరిని బలవంతంగా నరకానికి పంపడం, కొందరిని పరలోకం పంపడానికి సంబంధించినవి కావు. [4]ఈ నోట్ NASBలోని నా ప్రతిలో ఉంది. [5]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 311. [6]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.:

Wm. B. Eerdmans Publishing Co., 1988), 361. [7]*Anthropos* అనేది "మనిషి" ఆడ కావచ్చు, మగ కావచ్చు. [8]మరల, పౌలు ఉదాహరణ పనిమీద కేంద్రీకరింపబడిందే గాని, నిత్యత్వం మీద కాదు. [9]"నాశనము కొరకు" ఈ ఘటములను "సిద్ధపరచినది" ఎవరు అనే దానిమీద పండితులు చర్చించారు: వ్యక్తులు తమకు తామే, దేవుడు, సాతాను లేక ఎవరు? వచనం 23లో దేవుడు మహిమకొరకు పాత్రలను సిద్ధపరచుతున్నట్టు మాట్లాడబడినందున, వచనం 22లో దేవుని చర్యయే పౌలు మనస్సులో కూడ ఉండియుండవచ్చు. ఆ యా సంగతుల కలయిక ఉంటుందని మనం అర్థం చేసికుంటాం. వ్యక్తులే తమ జీవితాలవలన పరలోకానికో, నరకానికో సిద్ధపడతారు. [10]దేవుని భవిష్యత్ జ్ఞానం మీద నోట్సు రోమా పుస్తకం 3లో "ఆయన సంకల్పము చొప్పున (8:29, 30)" అనే పాఠంలో చూడు.

[11]పౌలు రోమీయులకు వ్రాసే కాలంలో సంఘమందు యూదులకంటెను అన్యజనులే ఎక్కువమంది ఉన్నారు. అనేకమంది యూదులు అంగీకరింపకపోగా ఆ అన్యజనులు యేసును అంగీకరించారు. [12]"Hosea" అనడానికి బదులు "Osee" అనియు (25 వచనం), "Isaiah" కు బదులుగా "Esaias" (27, 29 వచనాలు) అని KJVలో ఉంది. ఈ ప్రవక్తల గ్రీకు రూపాన్ని KJV ప్రదర్శించింది. [13]తాను ఏమి చేస్తానని చెప్పుతాడో దాన్ని చేసేవాడు దేవుడు – మరియు ఆయన దాని విషయంలో జాగు చేయడు – యెషయా 10:23 అంటే అదే అర్థమౌతుంది. [14]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 522-23. [15]Do not confuse "Sabaoth" with "Sabbath." "Sabaoth" means "hosts," referring to *armies* (McCord). The NIV translates the phrase "the Lord Almighty." [16]C. E. B. Cranfield, *Romans: A Shorter Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 215. For other references to God's mercy, see Romans 11:30-32. [17]Morris, 345. [18]Walter W. Wessel, notes on Romans, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1720. [19]Richard A. Batey, *The Letter of Paul to the Romans,* The Living Word Commentary (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 127.

## "ముందుగా సిద్ధపరచబడెనా"?

కొందరు వ్యక్తులు ఆయన కనికరాన్ని పొందడానికి దేవుడు ముందుగా తీర్మానించాడని, ఆ వ్యక్తులు ఏమి చేసినాసరే, ఆ నిర్ణయము మార్చబడదని, రోమా 9:23లోని "ముందుగా సిద్ధపరచబడిన" అనే ప్రయోగాన్ని కొందరు అర్థం చేసికొన్నారు. "నాశనమునకు సిద్ధపడి ఉగ్రతా పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో సహించినట్లు" రోమా 9:22ను గమనించు. దేవుని దీర్ఘ శాంతంలో గుప్తమైయున్న దేవుని ఉద్దేశము వీరికి మార్పు పొందునట్లు ఒక అవకాశం యివ్వడమే – నాశనమునకు కాక మహిమకు సిద్ధపడు పాత్రలగునట్లు చేయడం. నాశనంకొరకు సిద్ధమైన పాత్ర మహిమకొరకు సిద్ధపడిన పాత్రగా మారగలిగితే, అప్పుడు మహిమకొరకు సిద్ధపరచబడిన పాత్ర నాశనమునకు సిద్ధపరచబడిన పాత్రగా మారగలదు. సర్వాధికారపు దేవుని చర్యలు మానవ స్వేచ్ఛా చిత్తాన్ని రద్దుపరచవు. చిట్టచివరిది, ఏదో ఒక గుంపుతో స్నేహం కలిగియుండడానికి మనలో ప్రతి ఒక్కరం ఒక నిశ్చయానికి వస్తాం: అంటే మహిమకు సిద్ధపరచబడిన పాత్రలగానో నాశనమునకు సిద్ధపడిన పాత్రలగానో.